ఈనాడు శ్రీ సత్యసాయి
మంగళవారం సెప్టెంబరు 1, 2026

డీడీలు కట్టి.. డీలా

■ మంజూరు కాని గొర్ల షెడ్లు
■ ఏనిమిదేళ్లుగా ప్రదక్షిణలు

శివంపల్లిలో నిర్మించిన గోకులం షెడ్డు

ధర్మవరం పట్టణం, పుట్టపర్తి, న్యూస్‌టుడే: మొక్కుబడిగా చేపట్టే ఏ కార్యక్రమం అయినా ఆశయంలో చిత్తశుద్ధి లేకుంటే అది నీరు గారిపోవడం ఖాయం. అందుకు ఉదాహరణ గోకులం, మినీ గోకులం పథకాలు అములు.. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏనిమిదేళ్లుగా పాడి రైతులకు ముప్పతిప్పలు పడాల్సి వస్తోంది.

● 2014-19 తెదేపా హయంలో పాల ఉత్పత్తిని పెంచి, పాడి రైతులకు అధికలబ్ధి చేకూర్చాలని అప్పటి ప్రభుత్వం పలు రాయితీ పథకాలు, పరికరాలు మంజూరు చేసింది. పాడి రైతుల సొంత స్థలంలోనే షెడ్లను నిర్మించుకునేందుకు గోకులం, మినీ గోకులం పథకాన్ని ప్రవేశ పెట్టింది. గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ముడి పెట్టి నిధులు మంజూరు చేసేలా ప్రణాళిక రూపొందించి ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. 90శాతం రాయితీతో నిర్మించే గోకులం షెడ్లకు పాడి రైతు వాటాగా 10 శాతాన్ని డీడీల రూపంలో స్వీకరించింది.

● 2019లో జిల్లావ్యాప్తంగా వేలాది పాడిరైతులు బ్యాంకుల్లో డీడీలను తీసుకుని కార్యాలయాల్లో అందజేశారు. రూ.2,20,000 విలువైన గోకులం షెడ్డుకు రైతు వాటా రూ.18500గాను, రూ.1,65000 విలువైన మినీ గోకులం షెడ్డుకు రైతుగా వాటాగా షెడ్డుకు రూ.16,500ల చొప్పున నగదును స్వీకరించింది. అప్పట్లో ఎన్నికలు రావడంతో షెడ్ల నిర్మాణాల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

● 2019 ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చింది. రెండు, మూడు నెలలకే గోకులం, మినీ గోకులం షెడ్ల పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసి పాడిరైతుల ఆశలపై నీళ్లు చల్లింది. షెడ్ల నిర్మాణాలకు కట్టిన డీడీలనైనా వెనక్కు ఇవ్వాలని ప్రభుత్వాన్ని, శాఖాధికారులను కోరినా స్పందించలేదు.

● ఏళ్లుగా పాడి రైతులు డీడీల కోసం కార్యాలయాల చుట్టు తిరిగిన రోజులేదు. ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. డీడీలు కట్టి ఏనిమిదేళ్లు కావస్తున్నా చలనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా పరిస్థితి మారలేదు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారు.

డివిజన్ వారీగా..

డివిజన్	రైతుల సంఖ్య	డీడీల రూపంలో చెల్లించిన నగదు
హిందూపురం	100	రూ. 15,94,500
పెనుకొండ	310	రూ. 48,65,000
ధర్మవరం	180	రూ. 28,80,000

ఆదమరిస్తే.. అంతేమరి

అనంతపురం నుంచి కనగానపల్లి మండలం తగరకుంట వరకు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ మార్గంలో రంగంపేట-తోపుదుర్తి గ్రామాల నడుమ పీఏబీఆర్ కాలువపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతింది. అంచునే భారీ గొయ్యి ఏర్పడింది. ఇక్కడ ఎలాంటి రక్షణ గోడలు లేవు. వాహనదారులు ఆదమరిస్తే గొయ్యిలోకి పడే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని దోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆత్మకూరు

అనధికార లేఅవుట్లు.. ఎడాపుడా రిజిస్ట్రేషన్లు

బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం

ఈనాడు, పుట్టపర్తి: బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో అక్రమాలు స్థాయి చేరాయి. పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) గుర్తించిన అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను రిజిస్టర్ చేస్తూ అక్రమార్కులకు సహకరిస్తున్నారు. దీంతో పుడా ఆదాయానికి పెద్దమొత్తంలో గండి పడుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లను కట్టడి చేయాల్సిన యంత్రాంగమే అక్రమార్కులతో కుమ్మక్కై అడ్డగోలు రిజిస్ట్రేషన్లకు తెగబడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్తర్వులు బుట్టదాఖలు

పుడా పరిధిలో అనుమతులు లేకుండా వెలుస్తున్న అనధికార లేఅవుట్లను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు, ప్లాట్ల విక్రయాలను నిరోధించడంలో భాగంగా ఆయా సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేరుస్తున్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. అయితే పెద్దఎత్తున లంచాలు తీసుకుని అనధికార లేఅవుట్‌లోని ప్లాట్లను రిజిస్టర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఖజానాకు నష్టం..

అనధికార ప్లాట్లను రిజిస్టర్ చేస్తుండటంతో పుడా అనుమతులు తీసుకునేందుకు లేఅవుట్ల యజమానులు ఆసక్తి చూపడం లేదు. ఎంతో కొంత ఇచ్చి నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకుందామనే ధోరణిలో ఉంటున్నారు. ఫలితంగా ఫీజులు, ఓపెన్ స్థలాల మార్టిగేజ్ రూపంలో పుడాకు అందాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. దీంతోపాటు ప్లాట్ల కొనుగోలుదారులు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే అక్రమాలపై సమగ్ర విచారణ జరిపాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై పుడా వైస్ ఛైర్మన్ రామకృష్ణ వివరణ కోరగా అనధికార లేఅవుట్లపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎప్పటికప్పుడు వివరాలు అందిస్తున్నాం. కప్పలబండ లేఅవుట్‌కు సంబంధించి రిజిస్టర్ చేయవద్దని లేఖ రాశామన్నారు.

పుట్టపర్తి మండలం కప్పలబండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 48-2లో స్థానిక వైకాపా నాయకుడు ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఆ సర్వే నంబరులోని ప్లాట్లను రిజిస్టర్ చేయవద్దని పుడా అధికారులు జులై 13వ తేదీన బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ రాశారు. అయినా అందులోని 8 ప్లాట్లను రిజిస్టర్ చేయడం గమనార్హం.

పుడుతున్నాయ్.. కుడుతున్నాయ్

■ పురపాలికల్లో దోమల దండయాత్ర ■ అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

● పురపాలక
● వినియోగంలో ఉన్న ఫాగింగ్ యంత్రాలు
● మూలకు చేరినవి
● ఫాగింగ్ జరగని ప్రాంతాలు
● దోమల సమస్య తీవ్రత

జిల్లావ్యాప్తంగా పురపాలికల్లో దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను ఆవాసాలుగా చేసుకొని వ్యాప్తి చెందుతున్నాయి. రాత్రయితే చాలు కాలనీలు, వీధుల్లో ప్రజలను కుడుతున్నాయి. వీటి నియంత్రణకు ఫాగింగ్ సక్రమంగా జరగడం లేదు. చాలాచోట్ల కార్యాలయాల్లో ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. ఫలితంగా ప్రజలు దోమకాటుతో రోగాల బారిన పడుతున్నారు.

పురంలో తూతూమంత్రంగా..

● హిందూపురం ● చిన్నవి 4
● మూడు పెద్దవి, 21 చిన్నవి
● అన్ని వార్డుల్లో జరగడం లేదు.
● పట్టణంలో ఫాగింగ్ తూతూమంత్రంగా చేస్తుండటంతో దోమల బెడద అధికంగా ఉంది. సాయంత్రమైతే చాలు దోమకాటుకు బలి కావాల్సిందే.

- న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం

అటకెక్కిన యంత్రాలు

దశాబ్దాలుగా తీరని సమస్య

● పెనుకొండ ● 01
● 03 ● వజ్రాలపేట, నారాయణమ్మకాలనీ, బీటీఆర్‌కాలనీ, ఇందిరమ్మకాలనీ, బోయపేట, జీవసీకాలనీ, ఎగువగడ్డ తదితర ప్రాంతాలు
● ఎగువగడ్డ, నారాయణమ్మ, బీటీఆర్, అర్బన్, కాలనీల్లో దోమలు విపరీతంగా వ్యాపి చెందుతున్నాయి.

- న్యూస్‌టుడే, పెనుకొండ

నిధులు లేక మూలకు..

● పుట్టపర్తి ● 03 ● 01
● సాయినగర్, చిత్రావతి బ్రిడ్జి, ఎనుములపల్లి, ఎస్ఎస్ ఆసుపత్రి
● మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులో దోమలు విజృంభిస్తున్నాయి. నివారణకు ఫాగింగ్ చేసేలా చర్యలు చేపడుతున్నామని శానిటేషన్ అధికారి శివయ్య తెలిపారు.

- న్యూస్‌టుడే, పుట్టపర్తి

జనాభాకు తగ్గట్టు యంత్రాలేవీ?

● ధర్మవరం ● 04 ● 0
● శివారు కాలనీలైన శ్రీలక్ష్మిచెన్నకేశవపురం, ఇందిరమ్మ, వైఎస్ఆర్, కేతిరెడ్డి, తారకరామాపురం, చిన్నూరు రోడ్డు.
● పట్టణంలో ప్రధాన డ్రైనేజీలు, 5, 6 వార్డుల్లో దోమలు ప్రబలుతున్నాయి. 40 వార్డులున్న పట్టణంలో 1,45,651 మంది జనాభాకు సరిపడా ఫాగింగ్ యంత్రాలు లేవు. పది వార్డులకు కలిపి ఒకటి వినియోగిస్తున్నారు. అవి మరమ్మతులకు గురైతే ఫాగింగ్ చేయడం లేదు.

- న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

సాయంత్రమైతే నరకమే..

● కదిరి ● 01 ● 03 ● మారుతీనగర్, వాసవీనగర్ కుటాగుళ్ల, వాణివీధి, కంచుకోట, పూలబజార్, నిజాంవలి కాలనీ తదితర ప్రాంతాలు.
● కదిరి పట్టణంలో మురికివాడలు, మద్దిలేరు సమీప ప్రాంతాల్లో దోమల సమస్య తీవ్రంగా ఉంది. నల్లగుట్ట, వాణివీధి, అడపాలవీధి, తదితర ప్రాంతాల్లో ప్రధాన డ్రైనేజీలు శుభ్రంచేసి ఏళ్లవుతోంది. చాలా ప్రాంతాల్లో ఏడాదికో రోజే ఫాగింగ్ చేస్తున్నారు. సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా యంత్రాలను బాగు చేయించి, అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కదిరి**

కదిరిలోని నల్లగుట్టవీధిలో దోమలకు ఆవాసంగా మారిన డ్రైనేజీ

అనిశా వలలో పంచాయతీ కార్యదర్శి

■ రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తాను చేయాల్సిన పనికి డబ్బు డిమాండ్ చేసి ఓ ప్రభుత్వ ఉద్యోగి అనిశా(ఏసీబీ)కు చిక్కారు. తన కింద ఉద్యోగి ద్వారా లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. అనిశా డీఎస్పీ ప్రసాద్ రెడ్డి వివరాల మేరకు.. రుద్రంపేట పంచాయతీకి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాలనుకున్నారు. ప్లానింగ్ అప్రూవల్ కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా సకాలంలో అనుమతి ఇవ్వకపోగా.. సాకులు చూపుతూ రూ. పదివేలు డిమాండ్ చేశారు. రూ. 8వేలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న బాధితుడు.. ఆపై లంచం ఇవ్వడం ఇష్టంలేక ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ హోటల్‌లో బాధితుడి నుంచి పారిశుధ్య కార్మికుడు కంబగిరి ద్వారా పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా లంచం తీసుకుంటూ ఉండగా.. అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కర్నూలు ఏసీబీ కోర్టుకు తరలించారు.

ఏసీబీకి పట్టుబడిన హిదయతుల్లా, కంబగిరి

> ధర్మవరం పట్టణానికి చెందిన మరో యువకుడు పీజీ చేశారు. డిజిటల్ మార్కెటింగ్ నేర్చుకోవడం ద్వారా ఇంట్లోనే ఉండి రూ. 30 వేల వరకు సంపాదించుకోవచ్చన్న ప్రకటనను ఓ సామాజిక మాధ్యమ వేదిలో చూశారు. గ్రూప్‌లో జాయిన్ అయిన తర్వాత వందలాది మంది ఫీజు చెల్లించినట్లు చెప్పడంతో. . తానూ రూ. 15వేలు చెల్లించారు. రెండు రోజులపాటు డిజిటల్ మార్కెటింగ్‌కు సంబంధించిన య్యూట్యూబ్ వీడియోలు పోస్టు చేసిన నిర్వాహకులు.. మూడో రోజు గ్రూప్ క్లోజ్ చేశారు.

ఆన్‌లైన్ పాఠాలు.. అంతులేని మోసాలు

■ ఉమ్మడి జిల్లాలో పెద్ద సంఖ్యలో బాధితులు

ఈనాడు, పుట్టపర్తి: ఉద్యోగ సాధనకు.. ఉన్న కొలువును నిలుపుకోవడానికి.. కొత్త కోర్సులు నేర్చుకోవడం అనివార్యంగా మారింది. ఇంట్లోనే ఉంటూ సర్టిఫికేసన్ కోర్సులు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. ఇదే అదనుగా కేటుగాళ్ల నయా మోసాలకు తెరదీశారు. వీరి ఉచ్చులో పడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎంతో మంది యువతీ యువకులు బాధితులుగా మారుతున్నారు. వెనుకా ముందు ఆలోచించకుండా రూ.వేలల్లో ఫీజులు చెల్లించి.. మోసపోయామని ఆలస్యంగా తెలుసుకుని పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

అప్రమత్తంగా ఉంటేనే...

➡ కోర్సులు, ఉద్యోగాల పేరుతో ఆన్‌లైన్‌లో వందలాది నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. కేవలం సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను చూసి నమ్మడం తగదు. ఆన్‌లైన్ కోర్సుల్లో చేరేముందు.. ఆ సంస్థకు యూజీసీ, ఏఐసీటీఈ, నాస్కామ్ వంటి అధికారిక సంస్థల ఆమోదం ఉందో లేదో నిర్ధారించుకోవాలి.

➡ నైపుణ్యాలు నేర్పించడం వరకే విద్యా సంస్థల బాధ్యత. వంద శాతం ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే.. అది మోసమని గ్రహించాలి.

➡ ఫీజులను అధికారిక పేమెంట్ గేట్‌వే ద్వారానే చెల్లించాలి.

➡ కోర్సులు అందించే సంస్థల గురించి గూగుల్ రివ్యూలు, లింక్డ్ ఇన్ ప్రొఫైల్ వంటి ప్లాట్‌ఫాంల్లో గాలించాలి. సమీలన్నీ ఒకే రోజు. . ఒకే తరహా భాషలో ఉంటే.. అవి నకిలీవి అయ్యే అవకాశం ఉంది.

➡ ఆన్‌లైన్ కోర్సుల్లో చేరేముందు కనీసం 2-3 ఉచిత డెమో తరగతులు చూడండి. ఫీజు కట్టిన తర్వాత తిరిగి చెల్లించే (రీఫండ్) విధానం ఉందో లేదో చూసుకోవాలి.

➡ 3 నెలల్లో డేటా సైన్స్ నేర్చుకోండి. రూ. 50వేల జీతంతో ఉద్యోగం గ్యారెంటీ.. 'తక్కువ ఖర్చుతో నైపుణ్య కోర్సులు' అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు గుప్పిస్తున్నారు. రూ. వేలల్లో ఫీజులు చెలించిన తర్వాత వెబ్‌సైట్ మూసేసి ఉడాయిస్తున్నారు.'

> డబ్బు కట్టించుకుని మోసం చేస్తే వెంటనే '1930' హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి.. లేదా cyber-crime.gov.in వెబ్‌సైట్ ద్వారానూ ఫిర్యాదు చేయవచ్చు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందు ట్రాన్సాక్షన్ ఐడీలు, ఫోన్ నంబర్లు జత చేయడం తప్పనిసరి.

రెండేళ్ల(2025, 2026)లో ఆన్‌లైన్ మోసాలపై నమోదైన కేసులు	
అనంతపురం	35
శ్రీసత్యసాయి	50

ప్రతి అర్జీని బాధ్యతగా పరిష్కరించాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పుట్టపర్తిలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, జేసీ మౌర్య భరద్వాజ్, డీఆర్వో కొండయ్యతో కలసి 264 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

దివ్యాంగురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సత్యసాయి నీటి సరఫరా బంద్

■ అర్ధరాత్రి నుంచి కార్మికుల సమ్మెబాట

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి నీటి పథకం కార్మికులు జీతాల కోసం సమ్మెబాట పట్టారు. ఈ పథకం 1995లో ప్రారంభం కాగా.. 2021 వరకు ఎల్అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో కార్మికులకు జీతాలు ఇచ్చేవారు. అనంతరం గుత్తేదారుల పరిధిలోకి వచ్చినప్పటి నుంచి జీతాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. మొత్తం 570 మంది కార్మికులకు ఐదు నెలల వేతనాలు రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ పథకం నుంచి కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, రాప్తాడు, తాడిపత్రి, శింగనమల, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని 1,341 గ్రామాల్లో సుమారు 16.40 లక్షల మందికి నీరందుతోంది. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో నీటి సమస్య జటిలం కానుంది.

మోటార్ల స్విచ్‌లు ఆఫ్ చేస్తున్న కార్మికులు

టీటీ.. శ్రీశాన్వి మేటి!

మూడో తరగతిలో సరదాగా మొదలైన ఆట.. నేడు జాతీయ స్థాయికి ఎదిగితే.. ఓటములను గెలుపు మెట్లుగా మార్చుకుంటూ.. టేబుల్ టెన్నిస్ కోర్టులో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ భళా అనిపించుకుంటోంది అనంతపురం నగరానికి చెందిన పదో తరగతి బాలిక ముంటిమడుగు **శ్రీశాన్వి**. ఖేలో ఇండియా మేటి క్రీడాకారిణిగా జిల్లాకు పేరు తెస్తోంది.

తల్లిదండ్రుల ఆలోచనే..

శ్రీశాన్వి తండ్రి శంకర్‌నారాయణ హైదరాబాద్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఏజీఎం. తల్లి సునీత సింగనమల జడ్పీ హైస్కూల్‌లో పీడీ. పిల్లలు క్రీడల్లో ఉంటే చదువులోనూ చురుగ్గా ఉంటారని, జీవితాన్ని సానుకూలంగా తీసుకుంటారని వీరిద్దరి నమ్మకం. మూడో తరగతిలో ఉన్నప్పుడే ఆ విషయాన్ని కుమార్తెకు చెబితే.. టేబుల్ టెన్నిస్(టీటీ)ని ఎంచుకుంది.

ఓటమి నుంచి.. స్టేట్ ఫస్ట్‌వైపు

తొలిసారి అండర్-11 రాష్ట్రస్థాయి పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్‌లోనే వెనుదిరిగిన శ్రీశాన్వి.. ఆ ఓటమితో పట్టుదల పెంచుకుంది. కోచ్ ధనుంజయరెడ్డి మార్గదర్శకత్వంలో అలుపెరుగని సాధనతో.. తర్వాతి టోర్నీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే ఉత్సాహంతో అండర్-11, 12, 15 విభాగాల్లో వరుసగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

జాతీయ స్వర్ణం.. కార్పొరేట్ గుర్తింపు

జాతీయ స్థాయికి వెళ్లినప్పుడు ఆటను ఇంకా మెరుగుపరుచుకోవాలని గ్రహించిన శ్రీశాన్వి.. ఉత్తమ శిక్షణను వెతుక్కుంటూ వెళ్లింది. ఆటలో మెలకువలను ఒడిసిపట్టింది. ఫలితంగా అండర్-13 నేషనల్ డబుల్స్‌లో బంగారు పతకం సొంతమైంది. టీమ్ ఈవెంట్‌లో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించడంతో పాటు 'పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు' స్పాన్సర్‌షిప్‌ను దక్కించుకుంది. దిల్లీ వేదికగా.. వారి తరపున ఆటను కొనసాగించింది.

లక్ష్యం.. ఇండియా జెర్సీ: ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' స్పాన్సర్‌షిప్‌తో హైదరాబాద్‌లోని 'సోమనాథ్ అల్టిమేట్ టీటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ క్రీడాకారిణి.. ఇండియా జెర్సీతో అంతర్జాతీయ వేదికలపై ఆడి.. దేశానికి కీర్తి తేవాలన్నదే తన లక్ష్యమంటోంది. **- ఈనాడు, అనంతపురం**

అడ్డొస్తూ.. ఆయువు తీస్తూ

■ రహదారులపై వన్యప్రాణుల సంచారం
■ బెంబేలెత్తుతున్న వాహనదారులు

బ్రాహ్మణపల్లి గేట్ వద్ద బోల్తాపడిన కారు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రహదారులపై కుక్కలు, పశువులు, అడవి పందుల సంచారం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రిళ్లు అకస్మాత్తుగా రహదారిపైకి దూసుకొచ్చే జంతువులను తప్పించే క్రమంలో ఈ తరహా దుర్ఘటనలు చోటు చేసుకోవడం.. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడే అధికం...

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అడవి పందుల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా కళ్యాణదుర్గం-కుందిర్పి, బ్రహ్మసముద్రం, కంబదూరు, రాయదుర్గం, గార్లదిన్నె, పామిడి మండలాల పరిధిలో అటవీ ప్రాంతం ఎక్కువ. అడవి పందులు రాత్రిళ్లు ఆహారాన్వేషణకు వాటి స్థావరాలను వదిలి దూర ప్రాంతాలకు వెళుతుంటాయి. ఆపై తెల్లవారుజామున తిరిగి అడవుల్లోకి వెళుతూ. . రహదారులు దాటుతుంటాయి. అటవీ జంతువులు సంచరించే ప్రాంతాల్లో రోడ్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. కొన్నిచోట్ల ఆ మేరకు కనిపించడం లేదు.

తప్పించుకోవచ్చిలా..

అటవీ ప్రాంతాల గుండా వెళ్లేటప్పుడు వాహనాన్ని తక్కువ వేగంతో నడపాలి. వీలైనంత వరకు హైబీమ్ హెడ్‌లైట్లను వాడాలి. ఇవి రోడ్డు పక్కన ఉన్న జంతువులను ముందుగానే గుర్తించడానికి సాయపడతాయి. జంతువులు రోడ్డుకు అడ్డంగా నిల్చుంటే.. గట్టిగా, నిరంతరాయంగా హారన్ కొట్టి.. క్షణకాలం పాటు లైట్లను డిమ్ చేయాలి.

ఇటీవల ఇలా..

● ఈ నెల మొదటి వారంలో గుత్తి రోడ్డులో సోములదొడ్డి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆటోకు అడ్డుగా ఆవు రావడంతో.. వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. సోములదొడ్డికే చెందిన మహిళ దుర్మరణం చెందారు. ● తాజాగా బెళుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి గేట్ వద్ద కారుకు కుక్క అడ్డు రావడంతో.. దాన్ని తప్పించబోయి వాహనం పల్టీలు కొట్టింది. ఈ దుర్ఘటనలో నాగరాజు, రాఘవేంద్ర అనే వ్యక్తులు చనిపోయారు.

మూడేళ్లలో ఇలా..

	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
2024	7	5	8
2025	5	4	5
2026	4	6	12

తాగుకు 8.. సాగుకు 8.097 టీఎంసీలు

నేడు ఐఏబీ సమావేశం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహణ తేదీ ఎట్టకేలకు ఖరారైంది. 1వతేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. తీవ్ర వర్షాభావం, ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో జలాలు రాని పరిస్థితుల్లో ఈసమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. హెచ్చెల్సీ వాటాగా జిల్లాకు వచ్చే 16.097 టీఎంసీలను దామాషా ప్రాతిపదికన అన్ని రకాల జలాశయాలు, తాగునీటి పథకాలకు కేటాయించనున్నారు. అరకొర నీటిలోనూ ఆయకట్టుకు కొద్దిమేర ఇవ్వాలని అనుకున్నారు. మొత్తంగా 40 వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు ఇవ్వనున్నారు. ఇప్పటికే కార్యాచరణ సిద్ధం కాగా.. సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే వీలుంది.

వృథానే 5.774 టీఎంసీలు: ప్రస్తుత ప్రతిపాదిత గణాంకాల ప్రకారం.. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ వాటాగా 16.097 టీఎంసీలను కేటాయించారు. ఇందులో తాగునీటికి 8, సాగు నీటికి 8.097 టీఎంసీల ప్రకారం ఇవ్వాలని సంకల్పించారు. ఈ 16.097 టీఎంసీల్లో ఆవిరి, లీకేజీ, ఇతరత్రా వృథా కింద 5.774 టీఎంసీలు పోనున్నాయి. వృథా జలాలతో కలిపి ఆయకట్టుకు ఇచ్చే 8.097 టీఎంసీల్లో.. దామాషా ప్రకారం హెచ్చెల్సీ ప్రధాన కాలువకు 1.824, జీబీసీకి 1.716, ఎంపీఆర్ ఉత్తర, దక్షిణ కాలువలకు 2.464, పీబీసీ, టీబీసీ, మైలవరం కాలువలకు 2.093 టీఎంసీల ప్రకారం ఇవ్వాలని అనుకున్నారు. వీటిపైనే ఐఏబీ చర్చించనుంది.

(c) eenadu

కాసులిస్తే కానిచ్చేస్తారు!

అక్రమ రిజిస్ట్రేషన్లకు దుర్గం అడ్డా

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థలాలు, భూములు ఎవరివైనా సరే.. అందుకు సంబంధించి దస్త్రాలు సక్రమంగా లేకపోయినా పర్వా లేదు. కాసులిస్తే కళ్లు మూసుకుని పేర్లు మార్పు చేసి రిజిస్ట్రేషన్లు చేస్తారు.. అది ఎక్కడో కాదు కళ్యాణదుర్గంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే. కాసులిస్తే బతికున్న వారిని మరణించినట్లు, యజమానికి సంబంధించి ఇతరుల పేరు మీద భూములు, స్థలాలు మార్పు చేయడంలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారింది.

కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

అధికారుల తీరు ఇలా..

సబ్‌రిజిస్ట్రార్ 2022లో నరసాపురం భూముల రిజిస్ట్రేషన్ చేయగా సబ్‌రిజిస్ట్రార్ రామ్మోహన్‌నాయుడు అప్పుడు సస్పెండ్ అయ్యారు. సుమారుగా ఒకరు రెగ్యులర్, మిగిలిన ఆరుగురు ఇన్‌ఛార్జీలుగా ఇక్కడ కొన్ని రోజులుకూడా ఉండలేక పోయారు. తరువాత వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి 2025 జులై 24న రూ.5 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. తిరిగి ఇన్‌ఛార్జులే కొనసాగారు. ఇప్పటికీ ఇక్కడ మార్పు రావడం లేదు.

జరిగిన కొన్ని సంఘటనలు..

● ఇటీవలే బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లికి చెందిన బ్రాహ్మణుడికి సంబంధించి 34.05 ఎకరాల భూమికి నకిలీ పత్రాలు సృష్టించారు. భూయజమాని మరణించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని సిద్ధం చేశారు.

● నరసాపురం గ్రామానికి ఆయనకు బోయ, కురుబ కులాలకు చెందిన ఇద్దరు కుమార్తెలతో కూడిన వంశ వృక్షాన్ని సిద్ధం చేశారు. ఆ పత్రాలతోనే కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు మార్పుచేసి రిజిస్ట్రేషన్ చేయించారు. కొన్ని రోజులకు నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు వెలుగు చూడగా, పోలీసు స్టేషన్‌లో కేసు వేశారు.

చెందిన సోదరుల మధ్య భూమి తేడాలు వచ్చాయి.

● యలగలవంకకు చెందిన ఒకే కుటుంబానికి సంబంధించి భూములు ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్ చేశారు.

● ముద్దినాయనపల్లిలో రైతుల భూమిని ఇతరుల పేరు మీద మార్పు చేశారు.

● ఇటీవలే ఒంటిమిద్ది గ్రామంలో పలువురికి దస్త్రాలు పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ వారి పేర్ల పై మార్పు చేయడం జరిగింది.

సమస్యలు మా దృష్టికి వచ్చాయి

అన్ని ఆధారాలు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలి. తప్పుడు వాటితో చేయడం సరి కాదు. కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న వాటికి సంబంధించి బాధితులు తమ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ చేపడుతున్నాం. నిగ్గుతెలితే తదుపరి చర్యలు తీసుకుంటాం.

-విజయలక్ష్మి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ (డీఐజీ), అనంత, సత్యసాయి

బంతి పూల సాగు.. లాభాలు బాగు

మార్కెట్‌కు తరలించేందుకు బంతిపూలను సిద్ధం చేస్తున్న కూలీలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లికి చెందిన రైతు సంజీవరెడ్డి బంతిపూలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. స్వల్పకాలిక పంట మంచి దిగుబడితోపాటు ఆదాయాన్ని చేకూరుస్తోంది. ఎకరా విస్తీర్ణంలో సూపర్‌బాల్ రకం విత్తనాలు తెచ్చి సాగు చేశారు. అనంతపురంలో 100 గ్రాముల విత్తన ప్యాకెట్ రూ.1,250 వంతున 12 ప్యాకెట్లకు రూ.15 వేలు, కళ్యాణదుర్గంలోని నర్సరీలో విత్తనాలు నాటించగా ఒక్కో నారుకు 0.40 పైసలు చొప్పున రూ.5,500, సేద్యానికి, కలుపు తీసేందుకు, పురుగు మందులు, కూలీల ఖర్చులు ఇప్పటి వరకు రూ.60 వేలు వ్యయం చేశారు.

85 రోజులకు పంట చేతికొచ్చింది. మొదటి కోతలో 18 క్వింటాళ్లకు రూ.56 వేలు, రెండో కోతలో 16 క్వింటాళ్లకు రూ.50 వేలు చేతికందాయి. ఇంకా మూడు కోతల్లో 40-55 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని రైతు చెప్పారు. వినాయక చవితి పండగకు మంచి ధరలు ఉంటే ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. తోటలోనే కూలీలతో బంతిపూలను సంచుల్లో వేసుకుని వాహనంలో నేరుగా హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ధర ఉండడంతో లాభాలు పొందుతున్నారు.

నష్టాల నుంచి ఊరట

మునగ, మొక్కజొన్న, టమాటా పంటలు సాగు చేస్తే లాభాలు రాలేదు. దీంతో బంతి పూల సాగు చేపట్టాను. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నా. కొన్ని రోజుల్లోనే దిగుబడులు వచ్చాయి. మార్కెట్లో ఆశించిన ధర పలుకడంతో నష్టాల నుంచి గట్టెక్కుతున్నా. **- సంజీవరెడ్డి, రైతు, బోరంపల్లి**

సమస్య-సమాధానం

కిశోర్‌రెడ్డి (శాస్త్రవేత్త, కేవీకే రెడ్డిపల్లి)

సమస్య: మొక్కజొన్న పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. అవి పంటల్లోకి చొరబడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి.

- రెడ్డిపల్లి నరసింహారెడ్డి

సమాధానం: అడవి పందులను చంపడం నేరం. అవి పంటను నాశనం చేయకుండా చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవాలి. పొలం చుట్టూ గుంతలు తవ్వకున్నా పందులు రావు.

సమస్య: నిమ్మ తోటకు గజ్జి తెగులు వ్యాపించింది. ఎలా నివారించాలి. **- లింగారెడ్డి**

సమాధానం: నిమ్మ తోటలకు వ్యాపించిన గజ్జి తెగులు నివారణకు రైతులు బ్లైటాక్స్ 30 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

దోస పంట.. సిరులే ఇంటా

దోస కాయలను చూపుతున్న రైతు నారాయణరెడ్డి

కదిరి గ్రామీణం, గాండ్లపెంట, న్యూస్‌టుడే: కదిరి నియోజకవర్గంలో రైతులు బోరుబావుల కింద దోస పంటను సాగు చేసి మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు. గాండ్లపెంట మండల పరిధిలోని సోమయాజులపల్లి గ్రామంలో రైతు నారాయణరెడ్డి తన రెండెకరాల పొలంలో దోస పంట సాగు చేశారు. లిట్ అక్కిహల్ అనే విత్తనాలు నాటారు. అధికారుల సూచన మేరకు మందులను సకాలంలో పంటకు అందించారు. ఎకరాకు రూ.70 వేలు పెట్టుబడి పెట్టారు. 60 నుంచి 70 రోజుల కాలవ్యవధి కలిగిన ఈ పంట మొదటి కోతలో దిగుబడి రెండెకరాలకుగాను 20 టన్నులు వచ్చింది. కిలో రూ.20 చొప్పున వ్యాపారికి విక్రయించారు. ఈ లెక్కన పెట్టుబడిపోనూ సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు రైతు చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బొప్పాయి తోటల్లో తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. ప్రధానంగా బొప్పాయి పంటకు ఆశించే కాండంకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లను నివారించడానికి రైతులు బోర్డుమిశ్రమం ఒక శాతం, అలియేట్ 2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల వద్ద పోయాలి. ట్రైకోడెర్మా పొడి 10 గ్రాములు, లీటరు నీటికి కలిపి మొదలు వద్ద పోస్తే అధిక దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుందని శాస్త్రవేత్త తెలిపారు.

నార్సల వద్ద సాగవుతున్న బొప్పాయి పంట

చిట్కా

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కేశవ్

అర్జీని పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరం రాంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించారు. ప్రతి అర్జీదారునితో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి అర్జీలు తీసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చినట్లు ఆయన వెల్లడించారు. గడువులోపే ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు.

తాగునీటికి అత్యంత ప్రాధాన్యం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో బోర్‌వెల్స్ రీఛార్జ్ చేయడంతో పాటు తాగునీటి అవసరాలను తీర్చడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. సోమవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి, కోనాపురం ప్రాంతాల్లో చెరువులను పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. జీడిపల్లి జలాశయం నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ప్యాకేజ్-36ఏ, 36బి ద్వారా ఆయా చెరువులకు నీటిని సరఫరా చేసేందుకు అవకాశాలు సరిచూడాలన్నారు. నరసాపురం, గంగవరం, శ్రీరంగాపురం, కోనంపల్లి చెరువులకు తదుపరి దశలో నీరిచ్చేలా పరిశీలించాలన్నారు.

వక్క.. ఆదాయం పక్కా

జిల్లాలో విస్తరిస్తున్న సాగు

కణేకల్లు మండలం కొత్తపల్లిలో సాగు చేసిన వక్కపంట

కణేకల్లు, న్యూస్‌టుడే: కరవు జిల్లా అనంతపురంలో ఉద్యాన, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటలతో పాటు వక్క సాగుకు అనువుగా మారుతోంది. ఆరేళ్లు నిర్వహించుకుంటే తక్కువ పెట్టుబడితో, కూలీల భారంతో సతమతం కాకుండా అర్వై ఏళ్ల పాటు ఆదాయం పొందగల వక్క సాగుకు జిల్లా రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రతికూల పరిస్థితులను అనువుగా మార్చుకొంటుండటంతో జిల్లాలో వక్క సాగు క్రమంగా విస్తరిస్తోంది.

పెట్టుబడి ఖర్చు.. దిగుబడి

సాధారణంగా వక్కసాగుకు తొలి దశలో చల్లటి వాతావరణ పరిస్థితులు అనుకూలం. జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నా, ఐదేళ్లపాటు వక్క మొక్క నీడలో పెరిగేలా ఆముదం, మునగ వంటి అంతర పంటలు సాగు చేసుకొంటున్నారు. ఈక్రమంలో ఎకరా వక్క సాగుకు మొదటి ఏడాది రూ.70 వేలు, ఏటా పంట నిర్వహణకు ఎరువులు తదితర ఖర్చులకు రూ.25 వేలు చొప్పున ఖర్చు చేసుకుంటున్నారు. మూడేళ్లకు పూత, పిందెలు కాసి గెలలు ఏర్పడుతాయి. ఐదో ఏటా 3 క్వింటాళ్ల దిగుబడి చేతికందుతుంది. ఆరో ఏట నుంచి ఎకరాకు నికరంగా 6 క్వింటాళ్ల మేర దిగుబడులు చేతికందనున్నట్లు రైతులు చెబుతున్నారు. ఐదేళ్ల వరకు అంతర పంటలతో వచ్చే ఆదాయంతో ఊరట చెందుతున్నారు.

సాగు చేస్తున్నారిలా..

● వక్క సాగుకు వ్యవసాయ బోరులో పుష్కలంగా నీరు ఉండి, బిందు సేద్యం తప్పనిసరిగా ఉండాలి. ● నేల సారవంతంగా ఉండేలా చెరువు ఒండ్రుమట్టితో పాటు సేంద్రియ ఎరువు చల్లి పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ● కర్ణాటకలోని దావణగెర, శివమొగ్గ ప్రాంతాల్లోని నర్సరీల్లో ఏడాది పాటు పెంచిన చెట్లను రూ.35 వంతున కొనుగోలు చేసి అక్టోబరు, నవంబరు నెలల్లో పొలాల్లో నాటుతున్నారు. ● సాలుకు 9 అడుగులు, మొక్కకు 6 అడుగుల దూరం ఉండేలా ఎకరాకు 700 చెట్ల చొప్పున నాటుతున్నారు. బిందు సేద్యం ద్వారా మొక్కకు నీరు అందిస్తున్నారు. ● రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, అనంతపురం తదితర నియోజకవర్గాల్లో 2 వేల ఎకరాల్లో వక్క సాగు చేశారు.

కదిరి ఆలయ సమాచారం

కదిరి: శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు (మంగళవారం) ఉదయం 6గంటల నుంచి 6.45 గంటల వరకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. శ్రీవారికి 7గంటల నుంచి 9గంటల వరకు అభిషేక, స్వర్ణకవచ సేవలు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనం ఉంటుంది. రాత్రి ఏడున్నర గంటలకు శ్రీవారికి వెండి రథ ప్రాకారోత్సవం ఉంటుంది.

ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు

నవోదయ కాలనీలో క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న సర్ పరిశీలకుడు కిశోర్‌కుమార్, కలెక్టర్ ఆనంద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తప్పుల్లేని.. పారదర్శకమైన ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా పని చేయాలని 'సర్' రాష్ట్ర పరిశీలకుడు కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సహకారంతో తుది జాబితా పక్కాగా తయారు చేయాలి.. ఇందులో ఏ పొరపాట్లు ఉండకూడదన్నారు. సోమవారం ఆయన సర్ ప్రక్రియపై కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఈఆర్‌వో, ఈడీటీలతో సమీక్ష జరిపారు. తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం నగరంలోని నవోదయ కాలనీ, బీకే సముద్రం మండల కేంద్రం పోలింగ్ కేంద్రం 156 పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేసి ఓటర్లతోనూ మాట్లాడారు. సర్ అమలులో అనంత జిల్లా అగ్రభాగాన ఉండేలా పని చేయాలని సూచించారు. సర్ డేటా దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో మాలోల, ఆర్డీవోలు ప్రేమంత్‌కుమార్, వసంతబాబు, ఉప కలెక్టర్లు రామ్మోహన్, రమేశ్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కిరణ్మయి, ఈడీటీ కనకరాజు, రాజకీయ ప్రతినిధులు నారాయణస్వామి, నాగభూషణం, బాలరంగయ్య, సోమశేఖర్‌రెడ్డి, ఈరన్న, ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఒక్కరోజులోనే పరీక్ష ఫలితాలు

ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పరీక్షల విభాగం నిర్లక్ష్యాన్ని వీడింది. గతంలో ఏ పరీక్షలు రాసినా ఫలితాలు విడుదల చేయడానికి కొన్ని నెలలు గడువుపట్టేది. కానీ ఒక్క రోజులోనే ఫలితాలు విడుదల చేయడం విశేషం. డిగ్రీ 5వ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు ఈ నెల 30న నిర్వహించారు. 231 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వాటి మూల్యాంకనం 31న పూర్తి చేసి ఫలితాలను సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఇందులో 228 మంది ఉత్తీర్ణులయ్యారు. 98.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఎస్కేయూ వీసీ ఆచార్య జ్యోతికుమార్, పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య లక్ష్మయ్య చొరవ తీసుకోవడంతో ఫలితాలు విడుదల చేయడంలో రికార్డు సృష్టించారు.

EENADU Classifieds

JOBS

Wanted Experienced Civil Engineers, Supervisors, Accountant for well established Construction Company Cell: 9000677088

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీకు ATPలో పనిచేయుటకు సీనియర్ ఇంజనీర్ 5 to 8 సం||ల అనుభవం మరియు డ్రైవర్ కావలెను. సెల్: 7779992688

నరసింహ హీరో షోరూం అనంతపురం షోరూం నందు జాబ్ చేయుటకు టెలీకాలర్స్, ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్, హెల్పర్స్, వాటర్‌వాష్ హెల్పర్స్ కావలెను. 9951300882

ATP: మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు అకౌంటెంట్, రిసెప్షనిస్ట్, టెలికాలర్, సూపర్‌వైజర్ అర్జెంటుగా కావలెను. 35 Yrsలోపువారు సెల్: 9491555724

FACULTY/ TEACHERS

Wanted Teachers: wanted Qualified and Experienced Teachers for English, Telugu, IIT. Vignan Bharathi Vidyalayam, Bathalapalli. Cell: 9440360616.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

—: వివరాలకు :—
8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, అనంతపురము

DISPUTE No.DRA/CFS 12/2026

BETWEEN:

M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt Ltd., Ananthapuramu, Rep. by its Manager/Foreman. ...DISPUTANT

VERSUS

T.MAHAMMED THAYUB and 5 others

Opponent No. 4కు నోటీసు

4. T.KHAIRUNNISA BANU, W/o S.S.KHALEEL BASHA, MUSLIM, AGED ABOUT 31 YEARS, WORKING AS A PANCHAYATH SECRETARY, GRAMA SACHIVALAYAMU, PANDIPARTHI (V), SOMANDEPALLI (M), SRI SATYA SAI (DIST), R/o D.No.2-119-1, CHAKALUR (V), SOMANDEPALLI (M), SRI SATYA SAI (DIST). ...OPPONENTS

డిస్ప్యూటెంట్ బాకీ మొత్తం 5,68,861/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన డిస్ప్యూటెంట్‌లో Opponent No.4 అయిన మీరు తేదీ 16.09.2026న ఉదయం 11.00 గంటలకు The Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, D.No.6-3-134, 1st Floor, Ramnagar, Ananthapuramu నందు హాజరై ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల మీపై దావా పరోక్షంగా తీర్మానించబడును.

By Order of the Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, D.No.6-3-134, 1st Floor, Ramnagar, Ananthapuramu.

భూ పరిహారం ఇవ్వలేదని.. పురుగుమందు డబ్బాతో రైతు

పురుగుమందు డబ్బాను రైతు నుంచి లాక్కున్న పోలీసు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: భూ పరిహారం ఇవ్వలేదని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కరించడం లేదని పురుగు మందు డబ్బాతో రైతు రాజ్‌కుమార్‌నాయక్ రెవెన్యూ భవన్‌కు వచ్చాడు. సోమవారం రెవెన్యూ భవన్ ద్వారం వద్ద తనిఖీ చేస్తుండగా సంచిలో దస్త్రాలతో పాటు డబ్బా కూడా ఉండటంతో పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. పుట్టపర్తి మండలం గోనేనాయక్‌తండాకు చెందిన రైతుకు కప్పలబండ పొలంలో సర్వే నంబర్ 165-3హెచ్‌లో ఉన్న 1.15 ఎకరాల భూమిని.. రెవెన్యూ అధికారులు ఎన్‌హెచ్ 342 రహదారి నిర్మాణానికి స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన పరిహారం కోసం తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ చుట్టూ పరిహారానికి ప్రదక్షిణలు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని రైతు వాపోయారు. పరిశీలించి న్యాయం చేస్తామని ఆర్డీవో సువర్ణ హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

BEFORE THE NOMINEE OF DEPUTY REGISTRAR OF CHITS, II ZONE, MARGOSA ROAD, MALLESWARAM, AT BANGALORE.

Dispute No. DRB-2nd /CHITS/51/2026-27

DISPUTANT: M/s. MARGADARSI CHITS (KARNATAKA) PVT. LTD., Registered Office at Plot No-212, Opp. Gate No. 9 of Palace Ground, Bellary Main Road, Sadashiva Nagar, BANGALORE-560 080.

Branch: INDIRA NAGAR

Represented by its Foreman & Branch Manager.

-Vs-

OPPONENTS: Ms. R.KAVYASHREE & ORS

1. Ms. R.KAVYASHREE, W/o Mr. R.Sreenivasa Reddy, Major, M/s. Sri Annapoorneshwari Canteen Services, # 2-69, Malguru, Hindupur (MD), Sri Satyasai (DT), Andhra Pradesh-515 212.

SUIT NOTICE BY PAPER PUBLICATION TO OPPONENT Nos. 1

WHEREAS, the Disputant has filed the above dispute U/S 64 (1) of The Chit Funds Act, 1982 before The Deputy Registrar of Chits, II Zone, Bangalore for recovery of a sum of **Rs. 19,59,642/-** along with interest at 24% p.a. and the Court Costs from the Opponents and the above dispute has been referred to me for adjudication and disposal.

Notice sent to Opponent Nos. 1 by R.P.A.D. have been returned unserved. Therefore, the Opponent Nos. 1 named above are Therefore hereby directed to appear before me at the Disputant Company situated at Margadarsi Chits (K) Pvt. Ltd., # 25, II Floor, Ram Plaza, CMH Road, Indiranagar, Bangalore - 560 038 ON 17/09/2026 at 4:00 P.M with all relevant document failing which the above dispute will be decided as per law, in their absence.

Given Under My hand & seal on 22-08-2026

Sd/- V.Aruna, Nominee of Deputy Registrar of Chits, II Zone, Bangalore.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిశీలిస్తున్న జాంబియా బృందం

బత్తలపల్లి: మండలంలోని గంటాపురంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జాంబియా దేశానికి చెందిన 8 మంది ప్రతినిధులు సందర్శించారు. సోమవారం గంటాపురంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆర్‌వైఎస్ఎస్ చీఫ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మానాయక్‌తో కలసి పరిశీలించింది. నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, వాతావరణ మార్పులకు తట్టుకొనే వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో ప్రతినిధులు శాద్రెక్ మ్వాలే, ముకెలా ఎలిజబెత్ లుబాసి, చిజుంబా షెపాండే, బార్బ్రా ముకునీ ఎటినాలా టెంబో, ఎబోనీలోలోజి, బెలిండాచిలాలా, ఇమ్మాన్యుయేల్‌స్లోమా ఆరా తీశారు. జీవామృతం, ఘనజీవామృతం తదితర సూత్రాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ సుధాకర్, సురేష్, స్వాతి, ఏపీఎంఏఎస్ ప్రతినిధి కల్లెమని, రమాదేవి, ఎఫ్ఎమ్‌టీలు, ఐసీఆర్‌పీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, హరికుమార్, గంగమ్మ, నాగేంద్రమ్మ, సుకన్య, రవిచంద్ర, పార్వతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ఫిర్యాదుదారుని సమస్య వింటున్న ఎస్పీ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో పరిష్కరించాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 70 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకితా సురానా, సీఐలు లక్ష్మీకాంతరెడ్డి, బొజ్జప్ప, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

59 మందికి కారుణ్య నియామకాల ఉత్తర్వులు

నియామక పత్రాలు అందజేస్తున్న ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈవో విజయలక్ష్మి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: దాదాపు రెండు నెలల నుంచి ఊరిస్తున్న జడ్పీ కారుణ్య నియామకాల ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం రాత్రి ముగిసింది. ఈ నియామకాల కింద మొత్తం 59 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి వివిధ మండలాలను కేటాయించారు. అందులో 24 మందికి జూనియర్ సహాయకులు, అదే సంఖ్యలో టైపిస్టులు, 11 మందికి ఆఫీస్ సబార్డినేటర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఆఫీసు సబార్డినేటర్లు మండల ప్రజాపరిషత్తు కార్యాలయాలకే వెళ్లాలని ఆదేశించారు. జూనియర్ సహాయకులకు కొందరికి జడ్పీ పాఠశాలలకు పోస్టింగ్ ఇచ్చారు. మరికొందరిని జడ్పీ కార్యాలయంలో, పీఆర్ ఇంజినీరింగ్ డివిజన్లలో నియమించారు. 'కారుణ్య నియామకాల్లో కాసుల కక్కుర్తి' అన్న శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి కౌన్సెలింగ్ విధానంలో పోస్టింగ్‌లు ఇచ్చారు. కొందరికి కోరుకున్న చోట పోస్టింగ్ రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, సీఈవో విజయలక్ష్మి, ఉప సీఈవో కృష్ణమూర్తి, ఏవో నియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏమార్చి బంగారు ఆభరణాల చోరీ

5 తులాలు ఎత్తుకెళ్లిన తోటి ప్రయాణికురాలు

మాట్లాడుతున్న బాధితురాలు పుష్పలత

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: బస్సులో పక్కనే కూర్చున్న ఓ మహిళ తనను ఏమార్చి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పుష్పలత వాపోయారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. డి.హీరేహాళ్ మండలం లింగమనహళ్లి గ్రామానికి చెందిన పుష్పలత తన పుట్టినిల్లు కణేకల్లుకు వెళ్లింది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో కణేకల్లు నుంచి రాయదుర్గం రావడానికి ఆర్టీసీ బస్సు ఎక్కింది. సీట్లు ఖాళీగా ఉన్నప్పటికీ ఓ ప్రయాణికురాలు ఆమె పక్కనే వచ్చి కూర్చొంది. తోటి ప్రయాణికురాలు తన కుమారుడికి పాలు ఇచ్చేందుకు ఓ శాలువాను అడ్డుగా కప్పుకోవడంతో తనకు ఎటువంటి అనుమానం రాలేదు. రాయదుర్గం బస్టాండులో దిగి చేతి సంచిని (హ్యాండ్ బ్యాగ్) పరిశీలించగా బంగారు ఆభరణాలు కనిపించలేదని బాధితురాలు వాపోయింది. రెండు తులాలు మెడ గొలుసు (నెక్లెస్), తనవి, కుమార్తెకు సంబంధించిన కమ్మలు, తన భర్త గొలుసు అన్ని కలిపి 5 తులాల ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని యూపీఎస్ సీఐ దేవానంద్ తెలిపారు. అనంతపురంలో బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసిన రెండు రోజుల్లోనే ఈ ఘటన జరగడం తీవ్ర చర్చనీయాంశమైంది.

మోసం చేసి.. కార్లను తాకట్టు పెట్టి జల్సా

నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: అధిక బాడుగ ఇప్పిస్తానని వాహన యజమానులకు మాయమాటలు చెప్పి మోసం చేసి ఆ వాహనాలను తాకట్టుపెట్టి జల్సా చేస్తున్న అంకె అమరేశ్వర అలియాస్ హనుమంతును పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఉరవకొండలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ మహానంది ఎస్ఐ జనార్దన్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. ఉరవకొండ అంబేడ్కర్ నగర్‌కు చెందిన హనుమంతు అద్దెకు ఇచ్చే కార్ల యజమానుల వద్దకు వెళ్లి అధిక బాడుగ ఆశ చూపి వాహనాలను తీసుకువెళ్లి ఇతరులకు తాకట్టుపెట్టి సులువుగా డబ్బు సంపాదించడానికి అలవాటుపడ్డాడు. సుమారు 13 కార్లను కుదవ పెట్టాడని సీఐ తెలిపారు. మోసపోయిన వాహన యజమానుల్లో ఒక్కరైన ఎర్రిస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి కోసం గాలిస్తుండగా మండలం పరిధిలోని పాల్తూరు క్రాస్ వద్ద పట్టుబడినట్లు సీఐ వివరించారు. అతని నుంచి తొమ్మిది కార్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలియజేశారు. మోసాలు చేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఒకేచోట రెండు ప్రమాదాలు.. నలుగురికి తీవ్ర గాయాలు

ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, ద్విచక్ర వాహనం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: సంకేపల్లి క్రాస్ వద్ద వరుసగా జరిగిన రెండు రోడ్డు ప్రమాద ఘటనల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం రాత్రి రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో.. ముదిగుబ్బ వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న గుంజేపల్లికి చెందిన శ్రీధర్‌కు తీవ్రగాయాలు కాగా, ఆటో చోదకుడు రాముకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మరువక ముందే సోమవారం ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించేందుకు నిలిపి ఉన్న ఓ కారును దొరిగిల్లుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి వెనుక నుంచి వచ్చి ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

గొలుసు దొంగల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న రెండో పట్టణ సీఐ పుల్లయ్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వృద్ధ మహిళలే లక్ష్యంగా గొలుసు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను రెండో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7.50 లక్షలు విలువజేసే 5 తులాల రెండు బంగారు గొలుసులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ పుల్లయ్య టూటౌన్ పీఎస్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. రాజీవ్‌కాలనీ పంచాయతీలోని గణేనాయక్ కాలనీకి చెందిన షేక్ షాహిద్, మహదేవ్‌నగర్‌కు చెందిన బండారు విజయ్‌కుమార్‌లు చిన్ననాటి మిత్రులు. వీరు బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. షాహిద్ ఇంటి నిర్మాణం, తమ్ముళ్ల వివాహాల కోసం అప్పులు చేశాడు. విజయ్‌కుమార్ ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి అప్పుల పాలయ్యాడు. తమ అప్పులు తీరాలంటే చోరీలు చేయాలని ఇద్దరు నిర్ణయించుకొని రోడ్లపై ఒంటరిగా నడిచి వెళ్లే వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి, బైక్‌లో ఉడాయించేవారు. ఈ క్రమంలో గత నెల 11న అరవింద్‌నగర్ పార్క్ వద్ద, ఈ నెల 26న ప్రసన్నాయపల్లి రోడ్డులోని అగాపే చర్చి వద్ద మహిళల నుంచి బంగారు గొలుసులను వీరు చోరీ చేశారు. ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితులిద్దరినీ నగరంలో అరెస్టు చేసి, జిల్లా కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది.

(c) eenadu

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

కమనీయం.. గణపతి హోమం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని వినాయక ఆలయాల్లో సోమవారం రాత్రి సంకష్ఠచతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోట, టీచర్స్‌కాలనీ, శ్రీనివాసనగర్, ఏటిగడ్డ ఆంజనేయస్వామి, ఎంఎఫ్ రోడ్డులో ఉన్న గణపతి ఆలయాల్లో స్వామి వారికి కుంకుమార్చన, సహస్రనామార్చన, గణపతి హోమం చేశారు. స్వామి వారి వెండికవచ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. మహిళలు గణనాథుడిపై భక్తిగీతాలను ఆలపించారు. బెల్లం అచ్చులతో తయారు చేసిన దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

బైండోవర్ షరతులు ఉల్లంఘిస్తే జైలుశిక్షే

సోమందేపల్లి, న్యూస్‌టుడే: తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన తర్వాత మంచి ప్రవర్తనతో మెలగకుండా గతంలో మాదిరిగానే గొడవలు, ఘర్షణలకు పాల్పడిన వారికి జైలుశిక్ష తప్పదని ఎస్సై సుధాకర్‌యాదవ్ హెచ్చరించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసి తహసీల్దార్ మారుతి ఎదుట హాజరు పరిచారు. ఈ యువకులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని విచారణలో తేలడంతో తహసీల్దార్ వారికి ఏడు రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. నిందితులను పెనుకొండ ఉప కారాగారానికి తరలించినట్లు ఎస్సై వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అల్లరి మూకలు, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టామని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య : బూచెర్ల నుంచి రాచూరుకి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. దారి పొడవునా ముళ్లపొదలు పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రెండు వాహనాలు పక్కపక్కన వస్తే కంపలు గీసుకొని గాయాలు అవుతున్నాయి. సమస్య తీర్చండి. **- మురళి**
సమాధనం : పరిశీలించి రోడ్డు బాగు చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. **- వెంకటనారాయణ, మండల ఇంజినీరు, రొద్దం**
సమస్య: బూచెర్లలోని పలు వీధుల్లో వీధి దీపాలు వెలగట్లేదు. రాత్రయితే రోడ్డుపైకి రావాలంటే భయమేస్తోంది. **- ముత్యాలు**
సమాధనం : పరిశీలించి, వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- కృష్ణమూర్తి , పంచాయతీ కార్యదర్శి, ఆర్ లోచెర్ల**
– న్యూస్‌టుడే, రొద్దం

సమస్య: చిన్నగుడ్డంపల్లి నుంచి రంగాపురానికి వెళ్లే దారిలో ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. కొమ్ములు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు**
సమాధానం: పంచాయతీ సిబ్బందితో కంపచెట్ల కొమ్ములను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- ఎంపీడీవో దామోదరమ్మ**
– న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య: పట్టణంలోని అమృత్‌మహల్ థియేటర్ వాసవీధర్మశాలకు వెళ్లే రహదారిలో మొదటి భాగాన కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. దోమల బెడద తీవ్రంగా ఉంది. **- మహేంద్రకుమార్**
సమాధనం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శంకర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్**
సమస్య: పట్టణంలో పట్టణంలో రైల్వే రోడ్డులో నూతనంగా రహదారిని నిర్మించారు. కాని రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌పై మట్టి, స్తంభాలు వేయడంతో నడవడానికి ఇబ్బందిగా ఉంది. సమస్య తీర్చాలి. **- వెంకటేష్**
సమాధనం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్**
– న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

నెట్ లేక.. నెత్తి కొట్టుకుంటున్నారు

■ సచివాలయాల్లో సాంకేతిక సమస్య
■ దిష్టి బొమ్మల్లా ఏపీ ఫైబర్‌నెట్ యంత్రాలు

మడకశిర గ్రామీణం, పరిగి, లేపాక్షి, న్యూస్‌టుడే: స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏడేళ్ల నాటి కంప్యూటర్లు, బ్యాటరీలు మరమ్మతులకు గురై సర్వీసింగ్‌కు నోచుకోవట్లేదు. ఉన్న ఒకటి, రెండు కంప్యూటర్లతోనే సిబ్బంది ఆయా శాఖలకు సంబంధించిన వివరాలు నమోదు చేశారు. వీటితోనే వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు సేవలందించాల్సి వస్తోంది. మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లోని సచివాలయాల్లో 40 శాతం పైగా కంప్యూటర్లు సక్రమంగా పనిచేయట్లేదు. మరో పక్క సర్వర్, ఇంటర్‌నెట్ సమస్య తీవ్రంగా వేధిస్తుండటం.. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండటంతో వారికి సమాధానం చెప్పలేక సిబ్బంది నెత్తికొట్టుకుంటున్నారు.

నియోజకవర్గం	సచివాలయాలు
పెనుకొండ	76
మడకశిర	77
హిందూపురం	83

మొబైల్ నుంచి అనుసంధానించుకొనే

సచివాలయాల్లో ఇంటర్‌నెట్ సమస్య తలెత్తకుండా పనులు వేగవంతంగా జరగాలన్న ఉద్దేశంతో మూడేళ్ల కిందట ఏపీ ఫైబర్‌నెట్ బిగించాలని నిర్ణయించారు. యంత్రాలు తీసుకువచ్చి సచివాలయాల్లో ఉంచారు. ఇప్పటి వరకు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నెట్‌వర్క్ సమస్యతో పనుల కోసం వచ్చిన ప్రజలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి. ■ నాలుగేళ్లుగా సచివాలయాల్లో ప్రభుత్వానికి సంబంధించిన ఫోన్ నెట్‌వర్క్‌లు లేవు. సిబ్బంది సొంత మొబైల్ నుంచి ఇంటర్‌నెట్ కనెక్ట్ చేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇది చాలాక అవస్థలు పడుతున్నారు.

ఇక్కడ తీవ్ర ఇబ్బంది

పరిగి మండలం యర్రగుంట సచివాలయంలో ఫైబర్ నెట్ బాక్సు తెచ్చి ఏడాది దాటినా కనెక్షన్ ఇవ్వలేదు. కంప్యూటర్‌లకు బ్యాకప్ ఇచ్చే పవర్‌బ్యాంక్‌లు పనిచేయట్లేదు. విద్యుత్తు ఉంటేనే సేవలు అందుతున్నాయి. ■ మడకశిర మండలం హరేసముద్రం-2, బుళ్లసముద్రంలో కంప్యూటర్లు సక్రమంగా పనిచేయడం లేదు. నెట్‌వర్క్ సౌకర్యం కోసం ఏర్పాటు చేయాల్సిన ఫైబర్ నెట్ యంత్రం మూలన పడేశారు. ■ హిందూపురం మున్సిపాలిటీలో 38 స్వర్ణ వార్డులుండగా చాలా చోట్ల నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయడం లేదు. ■ లేపాక్షి మండలంలో 12 సచివాలయాల్లో ఫైబర్ నెట్ యంత్రాలు పనిచేయట్లేదు. సిబ్బంది మొబైల్ నెట్ కనెక్ట్ చేసుకొని విధులు నిర్వహిస్తున్నారు.

■ 'సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఫైబర్‌నెట్ కనెక్షన్ త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఇబ్బంది తీరుస్తాం' అని మడకశిర, పరిగి ఎంపీడీవోలు సోనిబాయి, అశ్వర్థప్ప తెలిపారు.

మూలకు చేరిన ఫైబర్‌నెట్ యంత్రం

మొబైల్ నుంచి ఇంటర్‌నెట్ కనెక్ట్ చేసుకుంటున్న సిబ్బంది

14 మందికి నేత్ర శస్త్రచికిత్సలు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: మండల పరిధిలోని సేవామందిర్‌లోని ఎల్‌వీప్రసాద్ సంస్థ ఆధ్వర్యంలో చౌడమ్మ కంటి పరీక్షా కేంద్రంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 30 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 14 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసినట్లు సేవామందిర్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కెటి.శ్రీధర్ తెలిపారు. వారికి మడకశిర మండలం నీలకంఠాపురంలోని ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌గా క్రాంతి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని హిందూపురం ప్రభుత్వాసుపత్రితో పాటు 10 ప్రాంతీయ ఆసుపత్రుల జిల్లా కోఆర్డినేటర్(డీసీహెచ్‌ఎస్)గా డా.క్రాంతి నియమితులయ్యారు. చిన్నపిల్లల వైద్యురాలిగా హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో సేవలందిస్తున్న ఈమెకు పదోన్నతి లభించింది. సోమవారం క్రాంతి డీసీహెచ్‌ఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న క్రాంతి

రాత్రివేళల్లోనే వినాయక విగ్రహాలు తరలించాలి

మాట్లాడుతున్న ఏఎస్పీ మహేశ్ తదితరులు

హిందూపురం: పట్టణంలో వినాయక విగ్రహాలు తయారు చేసిన ప్రాంతాల నుంచి ఏర్పాటు చేసే మండపాలకు విగ్రహాలను రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల లోపు తీసుకెళ్లాలని ఏఎస్పీ మహేశ్ అన్నారు. సోమవారం గణేశ్ ఉత్సవ కమిటీల సభ్యులతో ఏఎస్పీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పగటి వేళ వినాయక ప్రతిమలు తరలిస్తే ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తుతాయన్నారు. విగ్రహాలు తరలించే సమయంలో డీజే, బాణసంచా కాల్చితే చర్యలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆదివారం పగటిపూట గణేశ్ విగ్రహాన్ని తరలించటంతో ప్రమాదం జరిగిందని ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కృష్ణాష్టమి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్

పెనుకొండ, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 4న జరగబోయే కృష్ణాష్టమి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్పయాదవ్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల సభ్యులు సమావేశమయ్యారు. యాదవులకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ప్రదర్శించారు. సంఘం నాయకులు నరసింహులు, శ్రీరాములు, మంజునాథ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా క్రికెటర్ల ఎంపిక

కదిరి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంత జిల్లాలో మహిళా క్రికెటర్లను ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. అండర్-15, అండర్-18 విభాగాలుగా ఎంపిక చేస్తారన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని గ్రామీణ ప్రతిభా మహిళా క్రికెటర్లను గుర్తించే కార్యక్రమాన్ని ఆర్డీటీ రూరల్ క్రికెట్ టాలెంట్ పేరుతో చేపట్టినట్లు తెలిపారు. కదిరి పరిసర ప్రాంతంలో క్రికెట్‌పై ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా మైదానానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కూటమి పాలనలోనే గ్రామాల అభివృద్ధి

కల్వర్టు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు తదితరులు

గుడిబండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాలు ప్రగతి వైపు పరుగులు పెడుతున్నాయని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. గుడిబండ మండలంలోని వీరజ్జనపల్లి, బాలేపల్లి, ఇటికేపల్లి, వీసీగిరి గ్రామాల్లో రూ.కోటి నిధులతో సీసీ రోడ్లు, వజ్రహట్టి వంకపై రూ.50 లక్షలతో నిర్మించిన కల్వర్టు నిర్మించారు. సోమవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డా.శ్రీనివాసమూర్తితో కలిసి ఎమ్మెల్యే వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. రోడ్డు గుంతలను కూడా పూడ్చలేని దుస్థితి ఉండేదన్నారు. కూటమి పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న ఆలయ సమస్య పరిష్కారానికి, కురబరపల్లిలో ఇందిరమ్మ కాలనీకి వెళ్లే వంకపై మోరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు ఛైర్మన్ గురుమూర్తి, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ఎస్సీ సెల్‌జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని కేఎన్ పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వేణుగోపాలచార్యుల పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. తనకు విద్యా బోధన చేసిన గురువు వేణుగోపాలచారి సేవలను కొనియాడారు.

ఆర్భాటం చేసి.. అధ్వానంగా వదిలేసి

మండలంలోని తాళికెర ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు గదులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యాబోధనకు ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద ఆర్భాటంగా పనులు మొదలుపెట్టి సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపివేశాడు. దీంతో భవనం అసంపూర్తి పనులకే పరిమితమైంది. ఈ విషయమై సమగ్ర శిక్షా ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ భవనాల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. **- న్యూస్‌టుడే, గుడిబండ**

మట్టిదారే.. దిక్కు

మండలంలోని ఇటికేపల్లి ఇందిరమ్మ కాలనీలో ఏళ్లుగా మట్టిదారులే దిక్కవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికే దారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీసీరోడ్డు వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ముతుకూరు ప్రత్యేకాధికారి అబ్దుల్‌రెహ్మాన్ మాట్లాడుతూ నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. **- న్యూస్‌టుడే, గుడిబండ**

నిర్వహణ మరిచి.. మూలకు చేర్చి

దాతలను ప్రోత్సహంతో రొద్దంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల ప్లాంటు నిరుపయోగంగా మారాయి. 20 లీటర్ల శుద్ధి నీటిని రూ.2కే ఇవ్వాలనే లక్ష్యంతో వీటిని నెలకొల్పారు. నిర్వహణ గాలికొదిలేయడంతో ప్లాంటు మూతపడింది. భవనంతో పాటు, పరికరాలు దెబ్బతింటున్నాయి. పంచాయతీ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. **- న్యూస్‌టుడే, రొద్దం**

తొట్టె ఉంది.. ప్రయోజనం లేదు

మండలంలోని పాతశివరం ప్రాథమిక పాఠశాల ముందు భాగంలో పశువుల తాగునీటి తొట్టె బాగున్నా నీరు నింపట్లేదు. దీంతో నిరుపయోగంగా మారింది. వర్షాభావం కారణంగా తాగునీరు దొరక్క పశువుల తాహర్తి తీర్చేందుకు రైతులు దూరంగా ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ పైపు బాగు చేయించి నీరు నింపుతామన్నారు. **- న్యూస్‌టుడే, అమరాపురం**

నీటి ట్యాంకు.. అసంపూర్తి

మండలంలోని పూజారిపల్లిలో ఉపరితల నీటి ట్యాంకు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆరు నెలల కిందట పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. రక్షిత నీటి పథకం బోరు నుంచి నీరు నింపి ట్యాంకు ద్వారా సరఫరా చేయాలని దీని నిర్మాణం మొదలుపెట్టారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి మాట్లాడుతూ వెంటనే పనులు పూర్తి చేయించి నీటి సమస్య తీర్చుతామన్నారు. **- న్యూస్‌టుడే, గుడిబండ**

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్, అనంతపురము
DISPUTE No.DRA/CFS 13/2026
BETWEEN:
M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt Ltd., Ananthapuramu, Rep. by its Manager/Foreman. ...DISPUTANT
VERSUS
R.SREENIVASULU and others
Opponents No. 2 to 4కు నోటీసులు
2) N.JANARDANA, S/o N.KRISTAPPA, HINDU, AGED ABOUT 51 YEARS, WORKING AS A WORK INSPECTOR, O/o DY. EXE. ENGINEER, P.R.T. SUB DIVISION, TADIPATRI, ANANTHAPUR (DIST), R/o D.No.13-882-1, MARUTHI NAGAR, TADIPATRI.
3) V.C SREENIVASULU, W/o V.C.RAMANAIAH, HINDU, AGED ABOUT 52 YAERS, WORKING AS A RECORD ASST., O/o DEPUTY DIRECTOR, ANIMAL HUSBENDARY, PENUKONDA, SRI SATYA SAI (DIST), R/o D.No.1-650, NEAR BAJAJ SHOWROOM, PENUKONDA, SRI SATYA SAI (DIST).
4) T. ADINARAYANA, S/o T.RAMUDU, HINDU, AGED ABOUT 48 YEARS, WORKING AS A RECORD ASST., Z.P. HIGH SCHOOL, JUTURU (V), PEDDAPAPPUR (M), ANANTHAPUR (DIST), R/o D.No.001, PUTLUR (V) & (M), ANANTHAPURAMU (DIST).
డిస్ప్యూటెంట్ బాకీ మొత్తం 7,36,913/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన డిస్ప్యూటెంట్‌లో Opponents No. 2, 3, 4 అయిన మీరు తేదీ 16.09.2026న ఉదయం 11.00 గంటలకు The Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, D.No.6-3-134, 1st Floor, Ramnagar, Ananthapuramu నందు హాజరై ఎటువంటి అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల మీపై దావా ఏకపక్షంగా తీర్మానించబడును.
By Order of the
Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, D.No.6-3-134, 1st Floor, Ramnagar, Ananthapuramu.

ప్రకృతి సాగుతో ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయంలో తొమ్మిది సూత్రాల చక్రాన్ని పరిశీలిస్తున్న బృంద సభ్యులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకృతి సాగుతో భూమి సారవంతంతో పాటు, ఆ పంటలు తిన్న మనుషుల ఆరోగ్యం బాగుంటుందని వక్తలు పేర్కొన్నారు. మడకశిర డివిజన్‌లో రైతులు చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ విజయాలపై ఆగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రామ్ (ఏకేఆర్‌ఎస్‌పీ)కు చెందిన గుజరాత్, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాల ప్రతినిధుల బృందం సోమవారం క్షేత్ర సందర్శన చేసింది. ఆర్‌వైఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్‌ఎఫ్)కార్యక్రమాలను మూడు రోజుల పాటు ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. మొదటి రోజు బూదిపల్లి, జవనడుకు, ఆమిదాలగొంది గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పీఎండీఎస్ నమూనాలు, జీవ వైవిధ్య నిర్వహణ, రైతు ఆధారిత కార్యక్రమాలను బృందం పరిశీలించింది. జవనడుకులో 9 సార్వత్రిక సూత్రాల చక్రం ద్వారా ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వారికి వివరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విశేష పుష్పాలంకరణలో రాఘవేంద్రుడు

హిందూపురం సాంస్కృతికం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. హిందూపురంలోని రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు స్వామి వారి వివిధ రకాల పుష్పాలు, వెండి, స్వర్ణ కవచ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ● **పెనుకొండ:** పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, ఐముక్తేశ్వర ఆలయాల్లో శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ● **మడకశిర గ్రామీణం:** వర్షాలు కురవాలని హరేసముద్రంలో కన్నేరమ్మ, మల్లికార్జున, ఆంజనేయ ఆలయాల్లో భక్తులు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి జ్యోతులు సమర్పించారు.

పెనుకొండ: కాశీవిశ్వేశ్వరస్వామి

మండలంలో 240 పోలింగ్ కేంద్రాలు

గోరంట్ల: మండలంలోని 20 పంచాయతీల పరిధిలో 240 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఎంపీడీవో కమలాబాయి పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది పోలింగ్ కేంద్రాల జాబితా సోమవారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు ప్రదేశాల్లో ప్రకటించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పీజీఆర్‌ఎస్

పరిగి: ప్రజా సమస్యల పరిష్కారానికే పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర లైవ్ స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్, హిందూపురం పార్లమెంటరీ కార్యదర్శి వి.హనుమయ్య పేర్కొన్నారు. పరిగి మండలంలోని పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో పార్టీ బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం బూత్ కమిటీ సభ్యుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిని ఆయా శాఖలకు పంపుతామని నాయకులు తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

లేపాక్షి, న్యూస్‌టుడే: తప్పని సరిగా ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మానేపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా పౌరహక్కులకు భంగం కలిగితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో వాసుదేవరెడ్డి, వైద్యాధికారి వెంకటచిరంజీవి, ఎస్సై నరేంద్ర పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రొద్దం, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై రాజకుళాప్ప తెలిపిన వివరాల మేరకు.. రొద్దం పంచాయతీలోని పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు తరుచుగా కడుపు నొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రిల్లో చికిత్సలు చేయించిన నయం కాలేదు. దీంతో ఈనెల 27న మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పెనుకొండకు, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కంపులో మీరుంటారా?

ఏళ్లుగా తీయని పూడికలు.. స్థానికులకు అవస్థలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలో చాలాచోట్ల కొట్నూరు చెరువుకు వెళ్లే పెద్ద కాలువలో వ్యర్థాలు చేరి మురుగు పేరుకుపోతోంది. పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. వర్షాకాలంలో పెన్నార్ కుముద్వతీ ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు కుడికాలువ ద్వారా చెరువుకు చేరుతోంది. ఈ కాలువ నింకంపల్లి శివారు నుంచి ప్రవేశించి పట్టణ పరిధిలో కిలోమీటరు పొడవు ఉంది. ఇందులో ఎక్కడ చూసినా వ్యర్థాలు పడేస్తుండటంతో ఎటు చూసినా అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. సమీప కాలనీల వాసులు తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఏళ్లుగా అవస్థలు పడుతున్నా శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని పట్టణ వాసులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏయే ప్రాంతాల్లో ఇబ్బంది ఉందంటే

నింకంపల్లిలోని మూడు శివారు కాలనీలు, కంచికామాక్షి కల్యాణ మండపం రోడ్డు, కట్టకాలువ ఎడమవైపున సలామత్‌నగర్, సాయినగర్, మేళాపురం ఎస్సీకాలనీ, సదాశివనగర్, శ్రీనివాస థియేటర్ మార్గం, పరిగి రోడ్డు తదితర ప్రాంతాల సమీపంలో కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగు ముందుకు కదలకపోవడంతో భరించలేని కంపుకొడుతోంది.

◆ కాలువ పరిసరాల్లో నివాస గృహాలు, ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో జనసంచారం అధికంగా ఉంటోంది. దుర్గంధం, దోమల బెడద కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాహనాల్లో వెళ్లే చోదకులు ముక్కుమూసుకొని పోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

◆ నీటిపారుదల శాఖాధికారులు చొరవ తీసుకొని కాలువకు ఇరువైపులా సిమెంటు గోడలు నిర్మిస్తే ఆక్రమణలు, వ్యర్థాలు పడేసే ఆస్కారం ఉండదు. మున్సిపల్ అధికారులు తరచూ పూడికలు సక్రమంగా తీస్తే నీరు సాఫీగా పారుతుంది. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పెనుకొండ రోడ్డులో కొట్నూరు చెరువు కాలువ వ్యర్థాలతో అధ్వానంగా ఇలా

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పరిశీలించి రెండు శాఖల సమన్వయంతో సమస్య పరిష్కారానికి నివేదిక రూపొందిస్తాం. అవసరమైన నిధుల కోసం అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్తాం. తాత్కాలిక చర్యల్లో భాగంగా వ్యర్థాలను తొలగించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. **- మల్లికార్జున మున్సిపల్ కమిషనర్, గంగాద్రి, నీటి పారుదల శాఖ డీఈఈ**

మద్యం తాగిన చోదకులకు జరిమానా

అగళి, న్యూస్‌టుడే: అగళి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి మోటారు సైకిల్ నడిపిన పీ బ్యాడిగెర గ్రామానికి చెందిన నవీన్‌కుమార్, రొళ్ల మండలానికి చెందిన అశ్వర్థప్పపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంగడుయాదవ్ తెలిపారు. మడకశిర జేఎఫ్‌సీఎమ్ కోర్టులో వీరిని సోమవారం హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.20వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

లేపాక్షి: ఇటీవల పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు రమామణి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బహుమతులు, నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకుని జన్మదినం సందర్భంగా చోళసముద్రం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రమానందన్ తండ్రి విజయరావు చేతుల మీదుగా మొదటి స్థానంలో నిలిచిన సాయికీర్తనకు ల్యాప్‌టాప్, రెండో స్థానంలో నిలిచిన అనన్య, యశ్వంత్‌కు ఒక్కొక్కరికి రూ.20వేలు, మూడో స్థానంలో నిలిచిన భవ్యకు రూ.10వేలు అందించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన 200 మంది విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. తమ సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు. ఏటా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ ఇస్తున్న విజయరావు

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

రాఘవేంద్రస్వామికి ఉత్తర ఆరాధన

ధర్మవరం, న్యూస్‌టుడే: స్థానిక మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో సోమవారం ఉత్తర ఆరాధన నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని ఆలయంలో స్వామివారికి బృందావనాన్ని అలంకరించారు. మంత్రాలయం నుంచి విచ్చేసిన రుత్విక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గాంధీనగర్ రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కమనీయం.. ఖాద్రీశుడి కల్యాణం

అలంకరణలో మూలమూర్తులు

కదిరి, న్యూస్‌టుడే: శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి ఆర్జిత కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయంలోని కల్యాణ మంటపంలో శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభులను సుగంధ పుష్పాలతో రమణీయంగా అలంకరించారు. వైఖానస ఆగమశాస్త్రం మేరకు పుణ్యహవచనం, ఆరాధనలు, యజ్ఞోపవీత, కంకణధారణ, హోమం, గోత్రప్రవర పఠనం, మంగళ అష్టకం, మాంగళ్యధారణ, పూర్ణాహుతి, ఆస్థాన పూజలు చేశారు. కల్యాణ శ్రీవారు, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222
చెన్నేకొత్తపల్లి: 7893771238, కనగానపల్లి : 9100020921, రామగిరి : 7675919021

సమస్య: పురపాలక పరిధిలోని బీడుపల్లి ఎస్సీ కాలనీలో గత వారం నుంచి తాగునీటి మోటార్లు కాలిపోయి తీవ్ర నీటి కొరత ఏర్పడింది. సమస్య పరిష్కరించగలరు. **- మారుతి**
సమాధానం: మోటార్లు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- సువర్ణ, ఆర్డీవో, ప్రత్యేకాధికారి** – న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం

సమస్య: ముదిగుబ్బలోని కదిరి రోడ్డులో గేటు దగ్గర చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. **- చంద్ర, ముదిగుబ్బ**
సమాధానం: చెత్తదిబ్బలు తొలగించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం.

సమస్య: ముదిగుబ్బలోని శివాలయం వెనక వీధిలో మలుపు దగ్గర సీసీ రోడ్డు అంచు విరగడంతో ప్రమాదాలకు నిలయంగామారింది. **- కర్ణ, ముదిగుబ్బ**
సమాధానం: మరమ్మతులు చేయిస్తాం.

(పై రెండు సమస్యలకు ముదిగుబ్బ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున సమాధానమిచ్చారు)
– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

ఇళ్లు నిర్మించారు.. వసతులు విస్మరించారు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణాల శివారు ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఈ క్రమంలోనే పట్టణానికి సమీపంలో పోతులనాగేపల్లి పంచాయతీ పరిధిలోని వారికి స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇలా పలు కాలనీలు నిర్మించారు కానీ, మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోతులనాగేపల్లి: మట్టిదారులతో ఇలా..

అయిదేళ్లు గడుస్తున్నా...

అరకొరగా ఏర్పాటు చేసిన కాలనీల్లో 5 ఏళ్లు గడుస్తున్నా నేటికి ఏ ఒక్క వీధిలోనూ సీసీ రోడ్డు వేయలేదు. వారు మట్టి దారిలోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పోతుల నాగేపల్లి కాలనీలో 1700-1800 కుటుంబాల ప్రజలు నివాసం ఉంటున్నారు. కాలనీలో కొన్ని చోట్ల మాత్రమే వీధి దీపాలు, తాగునీటి ట్యాంకులు మాత్రమే ఉంటడంతో అవస్థలు పడుతున్నారు. పక్కనే పొలాలు ఉండటంతో రాత్రిపూట విషపురుగులు, అడవి పందులు సంచరిస్తున్నాయి. నీటి కొరతతో ఆటోల్లో వచ్చే శుద్ధజలాన్ని డబ్బులిచ్చి కొనుగోలు చేస్తున్నామన్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే.. 3కి.మీలు..

పోతులనాగేపల్లి కాలనీ ఏర్పాటు చేసేటప్పుడే ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు ఆదేశాలివ్వాల్సింది. కానీ గత ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాలనీ విద్యార్థులు మూడు కి.మీ దూరంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి విద్యను అభ్యసించాల్సిన దుస్థితి. ఉన్నత చదువులకైతే 6, 7 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని బాలబాలికలు వాపోతున్నారు.

శివారు కాలనీల్లో ప్రజల అవస్థలు

రేషన్‌దుకాణాలు అందుబాటులో లేక..

రేషన్ దుకాణాలు అందుబాటులో లేకపోవడంతో పట్టణంలోకి వచ్చి బియ్యాన్ని తీసుకుంటున్నామన్నారు. ఉచితంగా ఇచ్చే బియ్యం తెచ్చుకోవాలన్నా.. ఆటోలకు రూ.వంద చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. కాలనీలో డ్రైనేజీ కాలువలు లేక మురుగు ప్రధాన వీధుల్లోకి చేరడంతో జారి పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నామన్నారు. పట్టణ మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులు దృష్టి సారించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయం సిబ్బందే వారికి సేవలు అందిస్తున్నారు. పంచాయతీ నిధులు పోతుల నాగేపల్లి అభివృద్ధికి సరిపోవడం లేదు. ఇదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. కాలనీ వాసుల సమస్యలను వారికి తెలియజేశాం. **- వెంకటేష్‌చౌదరి, ఎంపీడీవో, ధర్మవరం**

'అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా పనిచేస్తున్నాం'

లబ్ధిదారులకు తోపుడుబండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా పనిచేస్తున్నామని రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకొని చిరు వ్యాపారులకు ఉచితంగా తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ .. కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు తోపుడు బండ్లను అందజేశామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ నాయుడు, పోతలయ్య, వెంకటేశు, నాయకులు అంజి, చల్లా సోము, బాలయ్య, బాలకృష్ణ, నాగభూషణ, రామ్మూర్తి నాయుడు, రంగయ్య, పరందామ యాదవ్ పాల్గొన్నారు.

పురపాలికకు ఎలక్ట్రిక్ వాహనాల అందజేత

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణ స్వచ్ఛత కోసం పురపాలక సంఘానికి చెత్త తరలించేందుకు అధునాతన ఎలక్ట్రిక్ వాహనాలను పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్నామని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. సోమవారం స్థానిక నేసేపేట పుట్లమ్మ ఆలయం వద్ద రెండు ఎలక్ట్రిక్ వాహనాలను పురపాలిక కమిషనర్ వెంకటరమణయ్యకు ఆయన అందజేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, కంచన్న, సుధాకర్, నాయకులు సందా రాఘవ, పల్లెం కృష్ణ పాల్గొన్నారు.

కోనేరు పనులు సకాలంలో పూర్తి చేయండి

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరు పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులకు తెలిపారు. ఆలయ భృగుతీర్థం అభివృద్ధి, మురుగు నీరు చేరకుండా చేస్తున్న నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన భృగుతీర్థం సుందరంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో..

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని గీతాలవారిపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అర్చకులు కలశంతో స్వాగతం పలికి, స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత

కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న తరిగోపుల రవీంద్ర

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మండలంలో నూతనంగా నిర్మిస్తున్న శిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి సోమవారం కోడేకండ్ల రామాపురం పినపెద్దగారి సంజీవ కుమారుడు రవీంద్ర రూ. 100,116ల నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ముష్టూరు గ్రామానికి చెందిన కరణం సూర్యప్రకాష్ కుమారుడు హేమంత్ రూ. 20,116. పుల్లప్పల్లి గ్రామానికి చెందిన గోనుగుంట్ల నాగభూషణ, పురుషోత్తం రూ. 10,116. నల్లాని పావని, భాస్కర్ రూ. 10,116. బత్తలపల్లికి చెందిన పుష్పావతి, శ్రీనివాసులు దంపతులు రూ. 10,116 నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకం

సన్మానించిన ఎమ్మెల్యే కందికుంట, ఆర్డీటీ డైరెక్టర్ మాంచోఫెర్రర్ తదితరులు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ తాము పని చేస్తున్న వృత్తిలో సేవలందించి గౌరవం పొందినప్పుడే గుర్తింపు ఉంటుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మర్రికొమ్మదిన్నే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్యామలాకుమారి, గూటిబైలు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ చిన్నాలు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు అందిస్తూ వారి జీవితాలకు మంచి మార్గాన్ని చూపే ఉపాధ్యాయుల సేవలు సమాజంలో ఎప్పటికి గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్ మాంచోఫెర్రర్, విశాలఫెర్రర్, ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఓబుళరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, మండల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో 8 ఫిర్యాదులు

ధర్మవరం, న్యూస్‌టుడే: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 8 ఫిర్యాదులు అందాయి. ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ధర్మవరం మండలం నుంచి 3, బత్తలపల్లి 2, ముదిగుబ్బ 2, చెన్నేకొత్తపల్లి 1 ఫిర్యాదులు అందాయని వాటిని పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామని ఆర్డీవో పేర్కొన్నారు.

భాజపా జిల్లా ఉపాధ్యక్షుడి ఎన్నిక

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జీనులకుంటకు చెందిన మేకల నాగార్జున శ్రీసత్యసాయి జిల్లా భాజపా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గత 12 ఏళ్లగా భాజపాలో ఉంటూ రెండు పర్యాయాలు మండల అధ్యక్షుడిగా, దళిత మోర్చ జిల్లా కార్యదర్శిగా ఒక పర్యాయం పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. పార్టీలో గుర్తింపుగా జిల్లా ఉపాధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఆయన భాజపా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

ధర్మవరం అభివృద్ధికి పాటుపడదాం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణ అభివృద్ధిపై సోమవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, ఇతరులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డి, పురపాలక కమిషనర్ వెంకటరమణయ్య, డీఎస్పీ జగన్నాథరాజు, మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఓఎస్‌డీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ఇతరులు పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ఏర్పాటు చేయనున్న సొసైటీ సభ్యులు వారి అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఏర్పాటు చేస్తున్న సొసైటీ ద్వారా ధర్మవరం పట్టణ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పట్టుచీరల తయారీ కేంద్రమైన ధర్మవరానికి ప్రత్యేక బ్రాండ్ తీసుకువద్దామన్నారు. సొసైటీ ఏర్పాటు ద్వారా పట్టణాభివృద్ధికి నిధులు వస్తాయన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు జయశ్రీ, పోలా ప్రభాకర్, గిర్రాజు నగేష్, జింకా రామాంజినేయులు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా క్రికెటర్ల ఎంపిక

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంత జిల్లాలో మహిళా క్రికెటర్లను ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఇందులో అండర్-15, అండర్-18 విభాగాలుగా ఎంపిక చేస్తారన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని గ్రామీణ ప్రతిభా మహిళా క్రికెటర్లను గుర్తించే కార్యక్రమాన్ని ఆర్డీటీ రూరల్ క్రికెట్ టాలెంట్ పేరుతో చేపట్టినట్లు తెలిపారు. కదిరి పరిసర ప్రాంతంలో క్రికెట్‌పై ఆసక్తి కలిగిన క్రీడాకారులు నేరుగా మైదానానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

యథావిధిగానే పోలింగ్ కేంద్రాల కొనసాగింపు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యథావిధిగా గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలనే కొనసాగిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. 132 పోలింగ్ బూత్‌లను గాండ్లపెంట పంచాయతీ కార్యాలయం, అన్ని పంచాయతీల స్వర్ణగ్రామ సచివాలయాల్లో ప్రదర్శన చేశారు. వేపరాల పంచాయతీలు.. వేపరాల, తాళ్లకాల్వలో నిర్వహించాలని ఫిర్యాదులు రాగా అందులో గతంలో ఉన్న తాళ్లకాల్వ పోలింగ్ కేంద్రంలోనే ఎన్నికల నిర్వహణ ఉంటుందని స్పష్టం చేశారు. కురమామిడి పంచాయతీలో రెక్కమాను, కురమామిడి ఉండాలని అర్జీలుగా రాగా.. గతంలో ఉన్న కురమామిడి గ్రామంలో పోలింగ్ బూత్‌కు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వచ్చినట్లు అధికారులు తెలిపారు. 14 పంచాయతీల్లో 132 పోలింగ్ బూత్‌లు గతంలో మాదిరే వచ్చాయని వాటి ప్రదర్శిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

వేతనాలు ఇవ్వాలని కార్మికుల డిమాండ్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లాలోని సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు అందించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ భవన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వకపోవడంతో తమ కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. సీఐటీయూ నాయకులు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, అధ్యక్షుడు శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు మధుసూధన్, నారాయణ, రమణ, హరికృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని కళాజ్యోతి సంస్థ శత వసంతాలు పురస్కరించుకొని ఆడిటోరియంలో సోమవారం టెన్నిస్ టోర్నమెంట్‌ను డీఎస్పీ జగన్నాథరాజు ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ టెన్నిస్ క్రీడాకారులకు కేంద్రంగా ధర్మవరం కళాజ్యోతి నిలవడం అభినందనీయమన్నారు. గ్రామాల్లోను క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్, టూటౌన్ సీఐ జయానాయక్, టెన్నిస్ సీనియర్ క్రీడాకారులు బండి రాము, రమేష్, శివ పాల్గొన్నారు.

కూడలి.. ప్రమాదంతో హడలి

కొత్తచెరువు శివారులో పెనుకొండ, గుట్టూరు రోడ్లు కలిసే కూడలిలో వేగనియంత్రికలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు హడలిపోతున్నారు. ఈ రెండు ప్రధాన మార్గాల్లో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. కియా పరిశ్రమకు చెందిన బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొత్తచెరువు

బిల్లులు పొందారు.. వదిలేశారు

మండలంలోని సోమరాజుకుంటలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు సగంలోనే ఆగిపోయి అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టిన నిర్వాహకులు బిల్లులు పొందినా వాటిని సగంలోనే ఆపేశారు. అధికారులు చర్యలు తీసుకుని మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంబులపూలకుంట

స్తంభం.. కూలేందుకు సిద్ధం

పట్టణంలోని జగ్జీవన్‌రామ్ నగర్‌లో విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆ స్తంభానికి కింది భాగంలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. దీంతో స్తంభం ఒక పక్కకు ఒరిగిపోయి తీగలు కిందకు వేలాడుతున్నాయి. పలుమార్లు విద్యుత్తు శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

ఆదమరిస్తే.. కాలువలోకే

పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ప్రధాన గేట్ వద్ద డ్రైనేజీ కాలువ ప్రమాదకరంగా మారింది. కార్యాలయం నుంచే రాకపోకలు సాగించే క్రమంలో ఆదమరిస్తే కాలువలోకే పడే అవకాశం ఉంది. కదిరి గేట్ సమీపంలో ఆర్‌వోబీ(ఉపరితల వంతెన) నిర్మిస్తుండటంతో దాని గోడలు కార్యాలయం వరకు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

సేవలతోనే సమాజంలో గుర్తింపు

ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న తెదేపా నాయకుడు రాఘవ

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పుడు ప్రజలు, సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని తెదేపా నాయకుడు సంధా రాఘవ తెలిపారు. సోమవారం పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంధా రాఘవ కళాశాల్లో డయాస్ షెడ్డు నిర్మాణానికి రూ. 3లక్షలు విరాళంగా అందజేశారు. దాని నిర్మాణం పూర్తి చేయడంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్‌ను తెదేపా నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆదినారాయణ, అధ్యాపకులు గోపాల్‌నాయక్, పీడీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయాల వేతనాలు పెంచాలని వినతి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ మున్సిపాలిటీ ప్రభుత్వ పాఠశాలల్లో 30 ఏళ్లుగా పని చేస్తున్న ఆయాలకు వేతనం పెంచడం లేదని, ప్రస్తుతం ఇస్తున్న రూ. 4,000లు కుటుంబ పోషణకు చాలడం లేదని సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాలకు వేతనం పెంచి, పని భారం తగ్గించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డికి కార్యాలయంలో సీఐటీయూ, కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, కార్మిక సంఘం నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి నేత్రదానం.. ఇద్దరికి చూపు

కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న వైద్యుడు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని నాగుల బావి వీధికి చెందిన సాకే కరూరప్ప నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సోమవారం కరూరప్ప మృతి చెందిన విషయం తెలియడంతో మానవతా సంస్థ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో నేత్రాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. జిల్లా అంధత్వ నివారణ విశ్రాంత అధికారి డాక్టర్ నరసింహులు, కంటి వైద్యనిపుణులు డాక్టర్ ఈశ్వర్‌రావు వాటిని సేకరించారు. ఆప్తాలమిక్ అధికారి ఉరుకుందప్ప, ప్రసాద్, మానవతా సంస్థ ధర్మవరం శాఖ ఛైర్మన్ నారాయణమూర్తి, అధ్యక్షుడు శంకర్‌నాయుడు, డైరెక్టర్లు నరసింహారెడ్డి, చిన్నప్ప పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బత్తలపల్లి న్యూస్‌టుడే: హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించుకోవాలని, చట్టాలపై అవగాహన ఉండటం ప్రతి పౌరుడి అవసరమని తహసీల్దార్ ఈశ్వర్‌ప్రసాద్, ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. సోమవారం వారు బత్తలపలిలోని ఎస్సీ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద సివిల్ రైట్స్‌పై కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామగిరి సమీపంలో ఆర్డీటీ నిర్మించిన కుంట

నీటి కుంట వెలవెల

రామగిరి, న్యూస్‌టుడే: ప్రతి వర్షపు నీటిబొట్టును ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంపొందించడం తోపాటు మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు ఆర్డీటీ 2007లో రామగిరి మండల కేంద్రం సమీపంలో దాదాపుగా రూ. 60 లక్షలతో నిర్మించిన నీటి కుంటలో చుక్కనీరు లేక వెలవెలబోతోంది. రామగిరి కొండల్లో నుంచి ప్రవహించే జలాలను ఒడిసిపట్టడానికి కొండల అంచుల్లో నీటి కుంట నిర్మించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం నెలకొనడంతో వర్షాలు కురవక పర్కులేషన్ ట్యాంకులో నీరు చేరకపోవడంతో ఎండిపోయి కళావిహీనంగా మారింది.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ శిశువు మృతి

తనకల్లు, న్యూస్‌టుడే: గుర్తు తెలియని ఆడ శిశువు అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు లక్ష్మీదేవి తెలిపారు. ఈ నెల 28న మండలంలోని చీకటిమానిపల్లిలో అప్పుడే పుట్టిన శిశువును సంచిలో ఉంచి చెత్తకుప్పల్లో పడేసి వెళ్లిన ఘటన విదితమే. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త రెడ్డెమ్మ ఆ శిశువును వైద్య కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉమ్మనీరు తాగడంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు జనార్దన తీవ్రంగా గాయపడ్డారు. వాహనచోదకుడు ప్రశాంత్ ద్విచక్రవాహనంపై వేగంగా రావడంతో పక్కనే ఉన్న బాలుడిని ఢీకొన్నాడు. గతంలోనూ అతను ఒక మహిళ ఢీకొనడంతో చికిత్స పొందుతూ మృతి చెందారని స్థానికులు తెలిపారు. దీనిపై యువకుడిపై బాలుడి తండ్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గాయపడ్డ బాలుడిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మత్తులో వాహనం నడిపిన వారికి జరిమానా

తనకల్లు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి కదిరి కోర్టు రూ. 18 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మద్యం తాగి బొలెరో నడిపిన లింగాల మండలం, మురళీ చింతల గ్రామానికి చెందిన బి. నాగేంద్ర.. నెల్లూరు జలదంకి మండలం, కృష్ణపాడు గ్రామానికి చెందిన దుర్గబాబు మద్యం మత్తులో కారు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని కదిరి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించారన్నారు.

కదిరిలోనూ నలుగురిపై..

కదిరి, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి కోర్టు జరిమానాలు విధించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఎస్ఐలు బాబ్జాన్, ధనుంజయరెడ్డిల సహకారంతో కదిరి పట్టణంలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడి కోర్టు ఎదుట హాజరు పరచిన నలుగురిలో ఒకరికి రూ. 9వేలు, ముగ్గురికి కలిపి రూ. 6వేల జరిమానా విధించారన్నారు. అలాగే 8 మందికి న్యూసెన్స్ యాక్ట్ కింద జరిమానా విధించినట్లు వివరించారు.

వైద్య క్లినిక్‌కు నిప్పు

కనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రైవేట్ వైద్య క్లినిక్‌కు దుండగులు నిప్పుపెట్టిన ఘటన కనగానపల్లి మండలకేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు ఆర్ఎంపీ విజయ్‌కుమార్‌రెడ్డి వివరాల మేరకు... కొన్నేళ్ల నుంచి గ్రామంలో అతడు వైద్య క్లినిక్‌ను నడుపుతున్నారు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు క్లినిక్‌కు ఉన్న తాళాన్ని బద్దలు కొట్టి లోపల ఉన్న వస్తువులపై పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. దీంతో వైద్య పరికరాలు, వస్తువులు, మందులు కాలిపోవడంతో రూ. లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అతడు తెలిపారు.

కాలిపోయిన వస్తువులు

దేవరచెరువు.. ఆహ్లాదానికి నెలవు

నడకకోసం ఏర్పాటు చేస్తున్న ట్రాక్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరికి సమీపంలోని దేవరచెరువు వద్ద సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాయలవారి కాలంలో నిర్మించిన అతిపెద్దచెరువు దేవరచెరువు. ఇది పిల్లలు ఆడుకోవడానికి అనువుగా విశాలంగా ఉంది.

రూ. 50 లక్షలతో పనులు

పట్టణానికి సమీపంలో ఉన్న ఈ చెరువు కట్ట విశాలంగా ఉండడంతో ఇక్కడ పిల్లలకు ఆటస్థలం, వ్యాహాళితో పాటు వ్యాయామం చేసుకోవడానికి వీలుగా రూ. 50 లక్షల అంచనాతో వాటర్‌షెడ్ పథకం కింద సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. విశాలమైన చెరువు కట్టపై నడవడానికి అనుగుణంగా 6 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు అందులో వివిధ రకాల ఆటల పరికరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సుందరీకరణ కోసం రూ. 43 లక్షలు ఖర్చు చేశారు. పచ్చదనం పెంచడంలో భాగంగా వీబీ జీ రామ్‌జీ పథకం కింద చెరువు పరిసరాల్లో మొక్కలు నాటుతున్నారు. సౌరవిద్యుత్తు దీపాలను ఏర్పాటు చేసి త్వరలోనే శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభిస్తారని వాటర్‌షెడ్ కదిరి పీవో రవీంద్రారెడ్డి తెలిపారు.

పిల్లల కోసం ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ ఏర్పాట్లు

(c) eenadu